

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణను పక్కాగా అమలు చేయాలి

రాయచోటి: వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్‌హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందిగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ్ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెసితోపాటు, డిఆర్ఒ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ టేక్‌హోమ్ రేషన్ అంగన్వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన పోషక బియ్యం, అనుబంధ పోషకాహార పంపిణీ పక్కాగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. జిల్లాలో 2275 అంగన్వాడీ కేంద్రాలున్నాయిని, వీటిలో మినీ అంగన్వాడీ కేంద్రాలు 1858, మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు 417 ఉన్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆగస్టు 2 నుంచి చేపట్టనున్న టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి గర్భిణీ, బాలింతలో ఉన్న రక్తహీనతను దూరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రఘురాం, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివరామమూర్తి పాల్గొన్నారు.

పులివెందులను గుండెల్లో పెట్టుకుంటా




పులివెందుల బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ఇక్కడికి నీళ్లు తెచ్చిన ఘనత నాదే

'సీమ'ను రతనాలసీమగా మారుస్తా

ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధంలో చంద్రబాబు వెల్లడి



అసంపూర్తిగా ఉన్న సిబిఆర్ పనులను పరిశీలిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/రూరల్/జమ్మలమడుగు రూరల్

రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం జమ్మలమడుగు నుంచి పులివెందుల వరకు రోడ్ షో నిర్వహించారు. గండికోట రిజర్వాయర్‌ను చంద్రబాబు సందర్శించారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు వద్ద ఆగిన పనులను కొండలపైకి నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. రాత్రి ఎనిమిది గంటలకు పులివెందులకు చేరుకున్న రోడ్‌షోకు ప్రజల బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పులివెందుల నాదని, గుండెల్లో పెట్టి చూసుకుంటానని తెలిపారు. పులివెందులకు నీళ్లు తెచ్చిన ఘనత తనదేనన్నారు.

పులివెందులలో వచ్చిన ఉత్సాహం చూస్తుంటే తిరు గుబాటు కనిపిస్తుందని తెలిపారు. చేసిన పాపాలు ఎక్కడికీ పోవు అవే ఇప్పుడు శాపాలుగా మారుతాయని అన్నారు. ప్రజలను చూసైన తాడేపల్లి నేతల్లో మార్పురావాలని పేర్కొన్నారు. కృష్ణా జలాలను పులివెందులకు తెచ్చిన ఘనత మాదేనన్నారు. ఆర్టికల్స్ అబ్బుగా పులివెందుల తీర్చు దువుతానని, నీరు ఉంటే సిరులు పండించవచ్చు అన్నారు. 2015లో పులివెందుల ప్రాంత రైతుల చీనీ పంటలు ఎండి పోతుంటే గండికోటకు రెండు టిఎంసిల నీళ్లు ఇచ్చి రైతుల ఆనందాన్ని నింపామన్నారు. పట్టిసీమను నిర్మించడం వల్లే రాయలసీమకు నీళ్లు అందుతున్నాయన్నారు. ప్రాజెక్టుల కోసం టిడిపి ఐదేళ్ల పాలనలో రూ.68 వేల కోట్లు ఖర్చుపెడితే వైసిపి రూ.22 వేల మాత్రమే ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. రాయలసీమకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేయడం జరి గిందని, వైసిపి కేవలం రూ.రెండు వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. సింహం ఎప్పటికైనా సింహమేనని పేర్కొన్నారు. నాతో పెట్టుకుంటే తొక్కుకుంటూ పోతానని, రాజధాని లేకుండా చేసిన వ్యక్తి జగన్ అని, పోలవరం ప్రాజెక్టు పనులు నిలిచిపోవడానికి కారణం జగన్ అన్నారు. బాబాయిని చంపి డ్రామాలాడుతున్నారని జగన్మోహన్ రెడ్డిపై ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి వివేక కుమార్తె సునీత పోరాటంపై ప్రశంసలు కురిపించారు. నీటిపారుదల మంత్రి ఒక ఆంబోతు మంత్రి అని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం చేసే సౌకర్యం కల్పిస్తామన్నారు. నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.3 వేల ఇస్తామన్నారు. పులివెందులలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని బాధ్యత మీ అందరి పైన ఉందని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసలరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, బిటెక్ రవి, నాయకులు సిఎం.సురేష్ నాయుడు

పులివెందులలో తీవ్ర ఉద్రిక్తత

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవవర్గం పులివెందులలో ఉద్రికత్త నెలకొంది. చంద్రబాబు పర్యటన ప్రారంభం కానుండగా పులివెందులలోని పూలంగళ్ల సర్కిల్ వద్దకు భారీ సంఖ్యలో టిడిపి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. అక్కడ అలజడి సృష్టించేందుకు వైసిపి శ్రేణులు యత్నించాయి. వైసిపి జెండాలు పట్టుకుని కారులో వచ్చిన ముగ్గురు కార్యకర్తలు జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ టిడిపి శ్రేణులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఆగ్రహానికి గురైన టిడిపి కార్యకర్తలు వెంటపడి తరమడంతో అక్కడి నుంచి వైసిపి కార్యకర్తలు వాహనంలో పరారయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు. రెండు గ్రూపులకు చెందిన వారిపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ ఘటనతో పులివెందులలో ఉద్రిక్తత నెలకొంది.

చికెన్ కొట్టుల్లోనూ ఎమ్మెల్యే వసూళ్లు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

స్థానిక ఎమ్మెల్యే చివరకు చికెన్ కొట్టుల్లోనూ వసూళ్లు చేస్తున్నారని, ఇలాంటి ఎమ్మెల్యే ఇక్కడ ఉన్నందుకు సిగ్గుండాలన్నారు. బుధవారం స్థానిక కోవెలకుంట రోడ్డు నుండి పాత బస్టాండ్ వరకు భూపేష్‌రెడ్డితో కలిసి నారా చంద్రబాబు నాయుడు రోడ్ షో నిర్వహించారు. ప్రజలు టిడిపి కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే ఆలోచనల్లో జగన్ లేడని ఎద్దేవా చేశారు. జమ్మలమడుగు ఇసుక హైదరాబాద్, చెన్నై, బెంగు ళూరుకు తరలిపోతుందని తెలిపారు. 2024లో భూపేష్‌రెడ్డిని గెలిపించి జమ్మలమడుగు అభివృద్ధికి కారకులు కావాలన్నారు. ప్రతి నిరుద్యోగ యువతకు ఉపాధి కలిపిస్తానని, రైతుతో పాటు అందరినీ అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు.



జమ్మలమడుగు రోడ్‌షోలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

మహిళలపై పెరుగుతున్న హింస

హింసపై మహిళల పోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి-బద్వేలు/కడప అర్బన్/ప్రొద్దుటూరు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలు, చిన్నారులపై రోజురోజుకూ దాడులు, హింస విపరీతంగా పెరిగిపోతున్నాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. మహిళల రక్షణ కోసం ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరుయాత్ర రాష్ట్ర జాతా బుధవారం నెల్లూరు జిల్లా నుంచి కడప జిల్లాలోకి ప్రవేశించింది. బద్వేలు, కడప, మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరు వరకూ సాగింది. ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. బద్వేలులో ఐద్వా జిల్లా కడప జిల్లా కార్యదర్శి ఐ.ఎన్.సుబ్బమ్మ జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని, హింస లేని సమాజం కోసం చేయి చేయి కలుతుదామని తెలిపారు. మహిళల రక్షణే తమ లక్ష్యం అంటూ గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం చట్టాలను చేయడం కాదు ఆ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని, దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిన్నారులపై, మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలు హింసకు గురవుతున్నారన్నారు. మహిళా రక్షణ కోసం తీసుకొచ్చిన పోక్సో చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మత్తు, మద్యం వల్లే నిత్యం మహిళలు హింసకు, దాడులకు గురవుతున్నారని వీటిని సంపూర్ణంగా నిషేధించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా మద్య నిషేధం చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. మద్య నిషేధ చట్టాన్ని తీసుకురాక పోగా మత్తు పదార్థాలను విచ్చలవిడిగా దొరికే విధంగా చేశారన్నారు. బిజెపి ప్రభుత్వం దేశాన్ని, దేశ సంపదను, ఖనిజాలను అదాని, అంబానీలకు దారాదత్తం చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దుచేసి కాశ్మీర్ భూములపై అదాని, అంబానీల పెత్తనం చలాయించే విధంగా చేశారన్నారు. మణిపూర్‌లో ఆదివాసులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపద ఉందని తెలుసుకొని ఆ సంపదను అదానికి దోచిపెట్టడానికి దేశ ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్ పేరుతో కులాల మధ్య చిచ్చు రేపి హత్యలు హత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. మహిళల డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో రెండు ప్రాంతాల నుంచి పోరు యాత్రను చేపట్టామన్నారు. ఈ నెల 8న విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి మహిళల పోరు ఏమిటన్నది ప్రభుత్వాలకు చూపిస్తామన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా ఐద్వా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు మేడా గౌతమి, పట్టణ అధ్యక్షులు గంప అనంతమ్మ, ప్రధాన కార్యదర్శి రత్తమ్మ, పట్టణ నాయకులు బాలమ్మ, మస్తాన్ బి.మోక్షమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, గంగనపల్లె నాగార్జున, మహిళా కన్వీనర్ సి.గురుదేవీ, పట్టణ నాయకులు ఆంజనేయులు, సురేష్, సురేంద్ర, సిఐటియు నాయకులు రాజగోపాల్, కాకర్ల బాబయ్య పాల్గొన్నారు.



కడప : సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



మహిళా కళాకారుల నృత్య ప్రదర్శన

అవిశ్వాస తీర్మానంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

మణిపూర్ సంఘటనలపై పార్లమెంటులో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన తమ వైఖరిని ప్రకటించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. కడప బాలికల కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలను సిఎం జగన్మోహన్‌రెడ్డి అక్కలు, చెల్లెలుకు అండగా ఉంటారా లేదా అనేది స్పష్టం చేయాలన్నారు. టిడిపి తటస్థంగా ఉంటామనడం అంటే గోడమీద పిల్లి లాంటి వేషాలేనని విమర్శించారు. జనసేన ప్రశ్నించేందుకే ఉంది అంటున్న పవన్ కళ్యాణ్ మణిపూర్ హత్యలు హత్యాచారాలపై ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో అదృశ్యమైన మహిళలను ఎంత మందిని గుర్తించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంతమందికి పునరావాసం కల్పించారు చెప్పాలన్నారు. జెవివి సమతా విభాగం నాయకులు సునీత మాట్లాడుతూ విద్యార్థినులు సమాజంలో చోటు చేసుకుంటున్న సంఘటనపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి టి.సావిత్రమ్మ, జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్. సుబ్బమ్మ, నగర కార్యదర్శి జమీల, నాయకులు శంషాద్, కామేశ్వరమ్మ, అనంతమ్మ, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, కళాజాత బృందం, కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి 4న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 4న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల ఎంప్లాయిస్ యూనియన్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య, సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు హరీంద్రనాథ్ శర్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో చలో కలెక్టరేట్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్ల వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఎపి గ్రామ పంచాయతీలలో పనిచేసే పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులందరూ శుక్రవారం ఉదయం 9 గంటలకు రాయచోటిలోని కలెక్టరేట్ వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, శ్యామలమ్మ, గోపాలు రాజు నాగరాజు కెవిపిఎస్ నాయకులు రఘునాథ్ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్వాతంత్ర సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని బుధవారం మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1921న బెజవాడలో గాంధి సూచన మేరకు పింగళి వెంకయ్య జాతీయ జెండాను తయారు చేశారని, స్వాతంత్రం సిద్ధంచిన తరువాత అదే మన జాతీయ జెండా అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు సువర్ణాదేవి, అరుణ, మహబూబ్‌జాన్, లలిత, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు సాకిబ్, విద్యార్థులు పాల్గొన్నారు.



పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

డిపార్ట్‌మెంటల్ పరీక్షకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి రాయచోటి

జిల్లాలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నెల 3న ఒక షిఫ్టుల్లో మదనపల్లె విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో అంగళ్ల వద్ద డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సత్య నారాయణ పేర్కొన్నారు. రాయచోటి కలెక్టరేట్ డిఆర్ఒ ఛాంబర్‌లో ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగుల పరీక్షల నిర్వహణపై బుధవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ శాఖపరమైన పరీక్షలకు జిల్లాలో 115 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు సంబంధించిన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు జారీ చేశారని చెప్పారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. ఒక షిఫ్ట్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ఆబ్జెక్టివ్ విధానంలో10 నుంచి 12 వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. . పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గడ్జస్ అనుమతించరని పేర్కొన్నారు. ఆయా పరీక్షలకు కమిషనర్ వారు నిర్దేశించిన బుక్స్‌ను మాత్రమే అనుమతిస్తారని, సెల్ ఫోన్లు తీసుకుని పరీక్షా కేంద్రంలోకి వచ్చిన వారిని గుర్తిస్తే మాల్ ప్రాక్టీస్ కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9:30 లోపు హాజరు కావాలని, ఆలస్యమైతే అనుమతించరని చెప్పారు. హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్ తప్పనిసరిని తెలిపారు. పోలీస్ బందోబస్తు, మెడికల్ క్యాంపు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరీక్షలు సజావుగా నిర్వహించడానికి శాఖల మధ్య సమన్వయం సాధించడం ముఖ్యమని స్పష్టం చేశారు. సమీక్షలో ఎపిపిఎస్‌సి అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి ఎస్.ఖాసీంవలి, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, పోలీస్, ప్రజా రవాణా, మెడికల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ సత్యనారాయణ

పని సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి : యుటిఎఫ్



ఎఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

అసంబద్ధ పని సర్దుబాటు ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ డిమాండ్ చేశారు. బుధవారం వారు డిఇఒ కార్యాలయంలో ఎడి ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ తిమ్మసముద్రంలో ఉన్న ఏకైక తెలుగు ఉపాధ్యాయురాలిని రాయచోటి పట్టణ సమీపంలోని గరుగుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేయడం, చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియం బోధించే ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిని రాజంపేట పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారని, తెలుగు మీడియం వారు ఉర్దూ మీడియంలో ఎలా బోధిస్తారు అర్థం కాని విషయం అని అన్నారు. ఆర్. రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి విద్యార్థులుండగా అక్కడ నుంచి ఒక ఇంగ్లీషు, ఒక లెక్కల ఉపాధ్యాయులను కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేయడంతో ఆర్.రాచపల్లిలో ఉన్న సింగిల్ ఇంగ్లీషు, గణిత ఉపాధ్యాయులు 8 తరగతులకు ఎలా నాణ్యమైన విద్యను అందిస్తారని ప్రశ్నించారు. పెనగలూరు మండలంలోని కొండూరు ఉన్నత పాఠశాలలో 8 తరగతులకు గాను అంధ ఉపాధ్యాయుడు, మరొకరు ప్రధానోపాధ్యాయులు ఆంగ్ల బోధిస్తున్నారని, వారిలో ప్రధానోపాధ్యాయులను రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సర్దబాటు చేయడంతో 8 తరగతులకు ఒక్క ఉపాధ్యాయుడు ఎలా బోధిస్తారని పేర్కొన్నారు. వెంటనే సదరు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ రెమ్యునేషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చెల్లించినప్పటికీ జిల్లాలో అరకొరగా రెమ్యునరేషన్ చెల్లించడం దారుణమని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్.సురేంద్ర రెడ్డి, రాయచోటి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, హఫీజుల్లా, రాజా రమేష్ వీరబల్లి మండల ప్రధాన కార్యదర్శి అమీనుల్లా, రఫీ పాల్గొన్నారు.

97 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శ్రీ షిరిడి సాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 97 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వీరిలో 36 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ లహరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రాయచోటి మున్సిపాలిటీకి

పెరిగిన హోదా

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపాలిటీకి హోదా పెరిగింది. గ్రేడ్ – 1 నుంచి స్పెషల్ గ్రేడ్‌గా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నుంచి జిఒ నంబర్ 104 ను జారీచేశారు. గతంలో గ్రేడ్ – 3 గా ఉన్న మున్సిపాలిటీని గ్రేడ్ –1 గా శ్రీకాంత్ రెడ్డి అప్ గ్రేడ్ చేయించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో పంచాయతీ నుంచి 2005 ఏప్రిల్ 29న రాయచోటి పట్టణం థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా అవతరించింది. మున్సిపాలిటీ అయ్యాక 31 వార్డులు ఏర్పడ్డాయి. శ్రీకాంత్ రెడ్డి కృషితో గ్రేడ్ –3 నుంచి గ్రేడ్ అప్ గ్రేడ్‌గా అభివృద్ధి చెందింది. రాయచోటిని జిల్లా కేంద్రం చేయించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపును తెచ్చారు. ప్రస్తుతం గ్రేడ్ 1 నుంచి స్పెషల్ గ్రేడ్ గా అప్ గ్రేడ్ చేయించారు. మదనపల్లె మున్సిపాలిటీతో సమానంగా రాయచోటి మున్సిపాలిటీ సెషల్ గ్రేడ్ అయింది. ప్రస్తుత మున్సిపాలిటీ ఆదాయం రూ.6 కోట్లకు పైబడి ఉంది. పట్టణంలో సుమారు ఒక లక్ష పదివేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నిత్యం రాయచోటి పట్టణానికి ఇతర ప్రాంతాలనుంచి వివిధ అవసరాల నిమిత్తం 10 వేల మందికి పైగా వచ్చి వెళుతుంటారు. కాగా పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందించే సేవలు, అభివృద్ధి పనులు పెరగాలంటే స్థానికంగా సమకూరే నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే నిధులతో పాటు హడ్కో లాంటి ఆర్థిక సంస్థలు ఇచ్చే రుణాలు కూడా అవసరమవుతాయి. ఆర్థికంగా మున్సిపాలిటీకి ఉన్న జవసత్వాలను ప్రామాణికంగా తీసుకుని, పట్టణంలో నివసిస్తున్న జనాభాను కొలమానికంగా అందించాల్సి సేవలు, వాటిని మెరుగుపరచాల్సింన అంశాలపై ప్రభుత్వాలు, ఆర్థిక సంస్థలు ఆసక్తి చూపుతాయి. ప్రభుత్వాలు నిధుల కేటాయింపు, వివిధ పథకాలను అమలు పరిచే విషయంలో గ్రేడ్ 1 మున్సిపాలిటీల కంటే స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలకు అధిక ప్రాధాన్యతలుంటాయి. లక్ష జనాభాకు పైగా ఉన్న రాయచోటి పట్టణ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు మున్సిపాలిటీ ద్వారా అందించడానికి స్పెషల్ గ్రేడ్ హోదా దోహదపడుతుంది. సిబ్బంది పెరిగి ప్రజలకు మరిన్ని సేవలు త్వరితగతిన అందుతాయి.

రాయచోటి మున్సిపాలిటీ గ్రేడ్ – 1 నుంచి స్పెషల్ గ్రేడ్‌గా అప్ గ్రేడ్ కావడంపై మున్సిపాలిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 1 గాను, జిల్లా కేంద్రం గాను, మున్సిపాలిటీ గ్రేడ్ – 1 నుంచి స్పెషల్ గ్రేడ్‌గా అప్ గ్రేడ్ చేయించేందుకు, మున్సిపాలిటీ అభివృద్ధికి మొదటి నుంచి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిజయజేశారు. స్పెషల్ గ్రేడ్ గా అప్ గ్రేడ్ కావడంతో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపాలిటీ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం



విద్యుత్ లైన్లను పెంచుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

విద్యుత్ లైన్ ఎత్తుపెంచిన సిబ్బంది

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యుత్ లైన్ ఎత్తు పెంచండి సారూ.. అనే శీర్షికతో జులై 29న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వైర్లు ప్రధాన రహదారికి సమీపాన తక్కువ ఎత్తులో ఉన్నందున వాహనాలు రాకపోకలు చేసే సమయంలో వాహనాల పైభాగాన తాకుతుండడంతో షార్ట్ సర్క్యూట్ అవుతుండడంతో ఫీజులు ఎగిరిపోవడం, ఇతర విద్యుత్ సమస్యలు ఏర్పడుతుండేవి. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యను గత నెల 29న విద్యుత్ లైన్ పెంచకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కథనం వెలువడడంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు బుధవారం తమ సిబ్బందిచే ట్రాన్స్ ఫార్మర్ నుంచి కొత్త వైర్లు లాగించి విద్యుత్ లైన్ ఎత్తును పెంచి సమస్యను పరిష్కరించారు. సమస్యను పరిష్కరించినందుకు స్థానిక ప్రజలు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, విద్యుత్అధికారులు గిరిధర్, ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.



చంద్రబాబును కలిసేందుకు కార్యకర్తలతో వెళుతున్న జగన్మోహన్‌రాజు

చంద్రబాబును కలిసిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాయలసీమలో నీటి ప్రాజెక్టులను పరిశీలనకు పులివెందులకు వచ్చిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడును నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె పేట గ్రామానికి చెందిన రొంపిచర్ల నాగేశ్వరరావు రెండవ వర్ధంతి పురస్కరించుకొని బుధవారం ఆయన కుమారుడు హరి ఆధ్వర్యంలో రేణిగుంట సమీపాన ఉన్న అభయ క్షేత్రంలోని అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయ క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతో షంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఆశ్రమాలలో అన్నదానం చేయా లని, ఆశ్రమంలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామిరెడ్డి, నరసింహులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానానికి సిద్ధంగా ఉంచిన ఆహారం



గోడపత్రాలు విడుదల చేస్తున్న అక్బర్‌అలీ, సుబ్బారెడ్డి

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు వరం

ప్రజాశక్తి-నందలూరు

పాఠశాల, కళాశాల స్థాయిలో మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిదని ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర పరిశీలకులు ఎస్.అక్బర్‌అలీ, ఉమ్మడి కడపజిల్లా సమన్వయకర్త కె.వి. సుబ్బారెడ్డి తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న ఓపెన్ స్కూల్ సమన్వయకర్తలతో నందలూరులో ఏర్పాటు చేసిన సమావేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌కు సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమయ్యాని అన్నారు. ఆగస్టు 31న చివరి గడువని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఓపెన్ స్కూల్‌లో చేరాలని కోరారు. ఈ సందర్భంగా ఓపెన్‌స్కూల్‌కు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో డిఇఒ కార్యాలయ సిబ్బంది సుగవాసి శివప్రసాద్, నందలూర్, రాజంపేట, కోడూరు, ఓపెన్‌స్కూల్ సిబ్బంది ఎస్.రౌఫ్‌బాషా, సూర్య నారాయణ, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ రమణయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రమణయ్య

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రమణయ్య బాధ్యతలు చేపట్టారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో 2013, 2015 సంవత్సరాలలో రెండు పర్యాయాలు ఇదే కళాశాలలో ప్రిన్సిపల్ గా విధులు నిర్వహించానన్నారు. ఎన్నో కళాశాలలో 23 సంవత్సరాలు విధులు నిర్వహించిన అనుభవం ఉందని తెలిపారు. 2022వ సంవత్సరంలో తాను చేసిన అధ్యాపక వృత్తికి ప్రభుత్వం గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును పొందినట్లు తెలిపారు.విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. విద్యా ప్రమాణాలను పెంచి ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ప్రిన్సిపల్ గా బాధ్యతలు చేపట్టిన రమణయ్యను ఘనంగా అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ' అద్భుత పథకం : జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అద్భుతమైన కార్యక్రమమని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో రాజంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సరళాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణులు, బాలింతలకు సౌకర్యంగా ఇంటి వద్దకే పౌష్టికాహార కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి మూడేళ్ల వయసు గల పిల్లలందరికీ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్‌హోమ్ పథకం కింద రేషన్ సరుకులను ఇంటివద్దకే ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పణిరాజకుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాణి, శంకరమ్మ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మితో పాటు నందలూరు, రాజంపేట మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు పోలి మురళీమోహన్ రెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, పోలి వేణుగోపాల్ రెడ్డి, దాసరి, పెంచలయ్య, దండు గోపి తదితరులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఐసిడిఎస్ సిడిపిఒ కే.భాగ్యమ్మ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా టేక్ హోమ్ రేషన్, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లనుఎంపీపీ లక్ష్మీనరసమ్మ పంపిణీ చేశారు. టేక్ హోమ్ రేషన్ కింద 3కేజీల బియ్యం, కేజీ కంది పప్పు, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, అర్ధ లీటర్ వంట నూనె అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా వైఎస్ఆర్ పోషణ కిట్ల ద్వారా 2కేజీల రాగిపిండి,కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం,250 గ్రాములు చెక్కీలు, 250 గ్రాముల ఖర్జూరం అందజేస్తారన్నారు. ఐసిడిఎస్ కార్యక్రమంలో ఇచ్చే సలహాలు,సంప్రదింపులు,సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి రామచంద్రయాదవ్, ఎంపిడిఒ శంకరయ్య, తహశీల్దార్ రఫిక్‌అహ్మద్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జి.హిజద్ ప్యారీ, జి.గౌరీదేవీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **సుండుపల్లి :** వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని వైఎస్ఆర్ సిపి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్ పంపిణీలో ఎంపిపి రాజన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామ చంద్ర ఎంఇఒ రవినాయక్, సిడిపిఒ సుగుణ, రాయవరం సర్పంచ్ మహమ్మద్ షరీఫ్, నాయకులు రహిమాన్‌ఖాన్, అంగన్వాడీ సూపర్వైజర్లు, వనిజ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, సుశీల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి :** తల్లి,బిడ్డ ఆరోగ్యం బాధ్యత ప్రభుత్వానిదేనని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ అంగన్వాడీ కార్యకర్తలతో వారి ఇంటి వద్దకే అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి, సర్పంచ్, ఎంపిడిఒ, అంగన్వాడీ పర్యవేక్షకులు అరుంధతి, సర్తాజ్ బేగం, హెల్త్ ఎడ్యుకేటర్, అమ్మాజీ, ప్రసన్న పాల్గొన్నారు.**రామాపురం :** వైఎస్ ఆర్ సంపూర్ణ పోషణ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరో గ్యాని కి రక్షణ కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి అన్నారు. **పెద్ద మండ్యం :** బుధ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవ టనంలో ఎంపిపి పూర్ణ చంద్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణులు, బాలిం తల సౌకర్యార్థం ఇంటికే పౌష్టికాహార కిట్టు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్‌రావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, తహశీల్దార్ రాము, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్ :** వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకంతో గర్భిణులు, బాలింతలు,0-5 సంవత్సరాల పిల్లలకు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె ఐసిడిఎస్ సిడిపిఒ సుజాత ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళి, మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీలలు హాజరయ్యారు. **నందలూరు:** నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు వైయస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హెూమ్ రేషన్ పంపిణీ చేశారు. **చిట్వేలి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గర్భిణులు,బాలింతల టేక్ హోమ్ రేషన్ ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ చంద్ర, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ఎల్.వి మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివరాంరెడ్డి, తహశీల్దార్ శిరీష, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి, వసుంధరమ్మ, విశాలాక్షి, సురేఖ, రాణి, సుధామని, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.**లక్కిరెడ్డిపల్లి :** వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్యం చేకూరుతుందని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎంపిపి అంబాబత్తిన రెడ్డయ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్‌లు పేర్కొన్నారు. ఎంపిడిఒ సభా భవనంలో బాలింతలకు, గర్భవతులకు సంపూర్ణ పోషణ పథకం కిట్ల పంపిణీ చేశారు. **కలకడ :** శారీరక, మానసిక ఎదుగుదలకు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు.. వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ పంపిణీ కార్యక్రమం మండల పరిషత్ కేంద్రం లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



రాజంపేట : చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న జడ్‌పి చైర్మన్



మదనపల్లి : వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామ సచివాలయాల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఏనుకొండపాలెం పంచాయతీ దిగువపాలెం, కదిరాయచెరువు పంచాయతీలలోని సచివాలయాలను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సచివాలయం సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయాల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. సచివాలయాలలో సిబ్బంది సమయపాలన పాటించి సకాలంలో కార్యాలయానికి చేరాలన్నారు. ప్రజలతో మమేకమై సానుకూలంగా వారి పనులను చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ కార్యాలయంలోని పనులను చిత్తశుద్ధితో చేసి మండలానికి, జిల్లాకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది పనితీరు సక్రమంగా లేకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యాలయంలో రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రదీప్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎంఇఒ మునీందర్‌నాయక్, సచివాలయం మండల కన్వీనర్ మోహన్‌రాజానాయుడు, పంచాయతీ కార్యదర్శి జయచంద్ర, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయాలలో రికార్డులను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ పొలంలో బోర్డు ఏర్పాటు చేయిస్తున్న తహశీల్దార్ నరసింహకుమార్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నరసింహకుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి గ్రామం పొలం సర్వేనెంబర్ 734లో 40 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన నర్సారెడ్డి భూమి చుట్టూ ముల్లకంచె వేసుకొని ఆక్రమించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే తమ రెవిన్యూ సిబ్బందితో పొలంలోకి వచ్చి ముల్లకంచెను తీసివేసి బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై స్పందించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కలెక్టర్ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసి పెండింగ్ సమస్యలన్నిటిని పరిష్కరించే విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, విఆర్‌ఒలు సోమశేఖర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని లాడ్జిల యజమానులు బాధ్యతా యుతంగా వ్యవహరించి నేరాల నియంత్రణకు సహకరించాలని డిఎస్‌పి కేశప్ప తెలిపారు. ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో పట్టణంలోని లాడ్జిల యజమానుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 7 గంటల లోపల అబ్స్ట్రాక్ట్ ను పోలీసు స్టేషన్‌లో అందజేయాలని, ప్రతి ఒక కస్టమర్ యొక్క ఐడికార్డు ఆధార్ కార్డు , గుర్తింపు కార్డులు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా తీసుకొని రిజిష్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు లాడ్జిలలో బసచేసినప్పుడు వెంటనే గోప్యంగా తమకు సమాచారం అందించాలని, లాడ్జీలో జూదం ఆడుట, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం సేవించడం వంటి చట్ట వ్యతిరేక అక్రమ కార్యకలాపాలను నిరోధిం చడానికి లాడ్జిల యజమానులు తమ వంతు సహకారం అందించాలన్నారు. నేరస్తులు ప్రస్తుత కాలంలో పలు రకాల చిరునామాలతో లాడ్జిలలో బసచేస్తూ ఉంటారని వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా లాడ్జిల అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జానం గంగిరెడ్డి దంపతులకు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

హైదరాబాద్ ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ 21వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభ కళా దీక్షితులు కళా వేదికలో బుధవారం అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తమ సంగీత, సాహిత్య, గాన, కళా, సేవా, ఉపాధ్యాయ, నటీనటులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, జర్నలిస్టులకు అవార్డులు అందించారు.అందులో భాగంగా పీలేరుకు చెందిన సామాజిక కార్యకర్త, పాత్రికేయుడు జానం గంగిరెడ్డి, ఉపాధ్యాయిని జానం సుజాత దంపతులు ప్రజలకు అందించిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి వారికి ఉత్తమ సామాజిక సేవా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో అంజనీకుమారిచౌదరి, రామానాయుడు, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆలూరి విల్సన్, ప్రముఖ కళాకారుడు జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ నారాయణస్వామి , కవి వడ్డేపల్లి కృష్ణ, నటుడు మాణిక్ పాల్గొన్నారు.

దళితులు పోరాటాలకు సిద్ధం కావాలి : విసికె

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో దళితులు తమపై జరుగుతున్న అఘాత్యాలకు వ్యతిరేకంగా మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని విసికె పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పీలేరులోని విసికె పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల మధ్య సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని సాధించడానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు, ఓసి కులాల్లోని పేదలకు అందుబాటులోకి తెచ్చిన రక్షణ, సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. మన రాష్ట్రంలో దళితులపై అనేక దారుణాలు జరుగుతున్నాయని, ఇటీవల వైసిపి అధికార ప్రతినిధిగా చెప్పుకునే పంచ్ ప్రభాకర్ అనే కుల దురహంకారి రాష్ట్రంలో 25 శాతం ఓటు బ్యాంకు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీలను సోషల్ మీడియా వేదికగా కుల దూషణలు చేసి తీవ్రంగా అవమానపరిచారని, దీనిపై ముఖ్యమంత్రి గానీ' దళిత ఉపముఖ్యమంత్రి గాని, దళిత హెూం మంత్రిగానీ, దళిత ఎమ్మెల్యేలు గానీ, ఎమ్మెల్సీలు గానీ, ఏ ఒక్కరూ స్పందించక పోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉందని, పాలకులు ఎస్సీ ఎస్టీల పట్ల చాలా నిర్ధయగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. దాడులకు వ్యతిరేకంగా దళితులు, గిరిజనులను కూడ గట్టి చుండూరు, కారంచేడు యుద్ధవీరుల స్ఫూర్తితో దెబ్బకు దెబ్బ తీసేందుకు సన్నద్ధం చేస్తూ, మరో స్వతంత్ర పోరాటానికి బహుజనులని సిద్ధం చేయడానికి "ఆగస్టు 6న అనంతపురంలో చుండూరు-కారంచేడు కుల నిర్మూలన సమర వీరుల స్మారక వీర వందన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు' చిదంబరం, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ తోల్ తిరుమావలవన్ హాజరవుతున్నారని, వీరితోపాటు జాతీయ, రాష్ట్రస్థాయిలో దళిత ఉద్యమాలు నడుపుతున్న పలువురు నేతలు కూడా హాజరవుతున్నట్లు తెలియపరిచారు. పేదరికం కూడా పెరిగిపోతూందని, నల్ల చట్టాలతో పౌర హక్కులను కాలరాస్తూ, ప్రజా పోరాటాలను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ' ఎస్టీలతో పాటు బీసీ, మైనార్టీ వర్గాలు, ప్రజాస్వామిక వాదులు ఈ సభకు హాజరై జయప్రదం చేయాలని పాలకుంట శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, వెంకటరెడ్డి, వంగిమళ్ళ గురునాథ, పాలకుంట చౌడప్ప, నాయుని సుబ్రమణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

రైతు సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. పిటిఎం మండలం దేవప్పకోట, మద్దయ్యగారిపల్లిలో బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను రారాజులు చేసేందుకు సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్య క్రమంలో ఎంపిపి మహమ్మద్, ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి, మద్దయ్యగారిపల్లి ఎంపిటిసి సయ్యద్‌బాషా, సర్పంచ్ రామంజులు, మడుమూరు సర్పంచి నాగరత్న భాస్కర్ నాయుడు, కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, సచివాలయం కన్వీనర్ రమణ, స్థానిక నాయకులు మెకానిక్ చంద్ర, ఫయాజ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పశువులకు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

లంపీ స్కిన్ వ్యాధికి టీకాలే శరణ్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పశువులకు వచ్చే లంపీ స్కిన్ వ్యాధికి టీకాలే శరణ్యమని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ సుమిత్ర తెలిపారు. బుధవారం మండలంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువులలో దోమలు, ఈగల ద్వారా లంపీ స్కిన్ వ్యాధి వస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి సోకితే పశువులు డిలా పడడం జ్వరంతో మేత మేయ్యక పశువు పూర్తిగా డిలా పడుతుందన్నారు. వంటిపై దద్దుర్లు రావడం, పుండ్లుగా మారడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి పశువుకు టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'విశ్వం' కళాశాలకు న్యాక్ 'ఎ' గ్రేడ్ సర్టిఫికేట్

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక అంగల్లు సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాల న్యాక్ 'ఎ ' గ్రేడ్ సర్టిఫికెట్ పొందినట్లు కళాశాల కారెస్పాండెంట్ చైర్మన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో న్యాక్ సిబ్బంది కళాశాలలో పర్యటించి, గత ఐదు సంవత్సరాల పూర్వపు వివరాలను పరిశీలిం చారని అన్నారు. కళాశాలలో వివిధ డిపార్ట్మెంట్ల వసతులు, విద్యార్థులకు అందించిన ఉద్యోగ అవకాశాలను గుర్తించారని అన్నారు. కళాశాలలో అత్యాధునిక ల్యాబోరేటరీ, డిజిటల్ లైబ్రరీ, హాస్టల్స్, క్యాంటీన్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, బస్సు సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారని అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, పూర్వపు విద్యార్థులను, ప్రస్తుతం ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులను విడివిడిగా మీటింగులు పెట్టి, వారి అభిప్రాయాలు తెలుసుకొన్నారని అన్నారు. అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారని అన్నారు. విశ్వం ఇంజినీరింగ్ కాలేజ్‌కు నాక్ ఎ గ్రేడ్‌ను ప్రదానం చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్‌లో క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇంప్రూవ్ చేయడంలో వెనుకాడమని, ఇప్పుడు వచ్చిన నాకు ఏ గ్రేడ్ ద్వారా మాపై బాధ్యతగా పెరిగిందన్నారు. రాబోయే విద్యార్థులందరికీ ఇంకా మెరుగైన వసతులు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని సంతోషాన్ని వ్యక్తపరిచారు.



మాట్లాడుతున్న ఎం.ప్రభాకర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వెంగంవారిపల్లెలోని జంగంవారి పల్లె, కత్తిరివారి పల్లె, గొల్లపల్లి గ్రామాలలో సర్పంచ్ శ్రీదేవి, నవీన్, మండల కో-ఆప్షన్ సభ్యులు, మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్.ఐ రమణారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను కలిశారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను పొందిన సాయాన్ని లబ్ధిదారులకు వివరించారు. సాయం వివరాలు కలిగిన బుక్‌లెట్‌ను వారికి అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేషగిరిరావు, సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, మండల కో-ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ రఫీ, నాయకులు నరేందర్ రెడ్డి , శ్రీనివాసులు శెట్టి, శివశంకర్ రెడ్డి, ఎర్ర మల్లయ్య, కదిరప్ప, దూకుడు వెంకటరమణ, మహేష్, ఎస్ఐ రామకృష్ణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **పీలేరు :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బోడుమల్లువారిపల్లి పంచాయతీ పరిధిలోని వినాయకనగర్, ఏటి నగర్, మేకలవానికాలువ, దుర్గానగర్, కోటిగారిపల్లి మొదలగు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఓ వైపు రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతూ మరో వైపు ప్రజల కనీస అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు తీరుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నవరత్నాలు ద్వారా సుమారు 100 శాతం మేరకు పూర్తి చేశారని తెలిపారు. ప్రజల ద్వారా గుర్తించిన స్థానిక సమస్యలను పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక దుర్గా గ్యాస్ ఏజెన్సీ అధినేత బి.అమరేంద్రనాయక్, సిబ్బంది ఎమ్మెల్యేను గౌరవిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్‌రెడ్డి, జడ్పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వైసిపి యువ నాయకులు జివి రాకేష్‌రెడ్డి, జ్ఞాన శేఖర్‌రెడ్డి, బోడుమల్లువారిపల్లి పంచాయతీ సర్పంచ్ భర్త అమర్నాథ్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, ఎంపిడిఒ మురళీమోహన్‌రెడ్డి, తహశీల్దారు ధనుంజయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

వ్యక్తిని గాయపరచడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గత నెల 27న మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ సింగనోడుపల్లెకు చెందిన భాస్కర్ కుమారుడు హేమంత్ స్థానిక నవాబుపేట చెరువులో చేపలు వేటాడుతుండగా నవాబుపేట పంచాయతీ చావిడికాడపల్లికి చెందిన గుర్రం సూరి అనే వ్యక్తి హేమంత్‌ను దుర్భాషలాడి బండరాయితో గాయపరచినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. హేమంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రం సూరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు